
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.7, కనిష్ఠం 24.9



వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి ఫిజికల్ ఫిట్నెస్

- విధి నిర్వహణ ఎంత ముఖ్యమో ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యం: ఎస్పీ జానకీ షర్మిలా



పరేడ్‌లో పాల్గొన్న పోలీసులు

నిర్మల్‌రూరల్,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి):జిల్లా పోలీస్ ఏఆర్‌హెడ్ క్వార్టర్స్‌నందు శనివారం జిల్లా లోని సివిల్, ఆర్మ్ రిజర్వ్ పోలీస్, సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్‌డ్రిల్‌స్క్వాడ్‌డ్రిల్ ప్రదర్శనని ఎస్పీ పరిశీలించారు.ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడు తూ.. వీక్లీపరేడ్ వల్ల సిబ్బందికి ఫిజికల్ ఫిట్నెస్‌తో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి బాగా ఉపయోగపడుతుందని, సమయం దొరికినప్పుడు సిబ్బంది, అధికారులు వ్యాయామం చేయడం అనేది చాలా ముఖ్యమని,మంచిశక్తి సామర్థ్యాలతో ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా విధులు నిర్వహించ డానికి మంచి అవకాశం ఉంటుంది. ఫిట్నెస్‌ను అనునిత్యంకాపాడుకోవాలన్నారు.పోలీసులు మంచి జీవన విధానాన్ని అవలంబించాలన్నారు.క్రమశిక్షణతో డ్యూటీలను నిర్వర్తించాలని, జిల్లాకు, తెలంగాణ పోలీస్ శాఖకు మంచిపేరు తీసుకురావా లన్నారు. సిబ్బందికి చేయవలసిన విధులు, చేయకూడని పనుల గురించి పలుసూచనలు చేయడం జరిగింది.ఏదైనావ్యక్తిగత సమస్యలు ఉన్న, డ్యూటీల వద్ద సమస్య ఉన్న, ఆరోగ్య సమస్య ఉన్నఉన్నతా ధికారులదృష్టికి తీసుకురావాలన్నారు. చెడు వ్యసనాలకు, చెడుస్నేహాలకు అలవాటు పడి విధులలో నిర్లక్ష్యంవహించి, పోలీస్ శాఖ ప్రతి ష్టకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించ రాదని హెచ్చరించారు.రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు.ఈపరేడ్‌లో ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్, ఇన్స్‌పెక్టర్లు రవీంద్రనాయక్, గోవర్ధన్ రెడ్డి,మల్లేష్, కృష్ణసాయి కుమార్, సమ్మయ్య, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రామ్‌నిరంజన్ రావు, రమేష్, శ్రీపాల్, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొ న్నారు.



ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్ (ఫైల్)

- షెడ్యూల్ ప్రకారం జిల్లాకు అందుతున్న యూరియా
- ఈ వర్షాకాలం పంటకు 35 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అంచనా
- జిల్లాకు చేరిన 24 వేల మెట్రిక్ టన్నుల యూరియా రైతులు ఉపయోగించినది 21వేల మెట్రిక్ టన్నులే
- యూరియా పక్కదారి పట్టకుండా జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో తనిఖీలు
- జిల్లాలో 3.87 లక్షల ఎకరాలలో ప్రధాన పంటల సాగు

పకడ్బందీ ప్రణాళికతో
యూరియా కొరతకు చెక్

నిర్మల్,ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల యూరియా కోసం రైతన్నలు క్యూ కట్టడం చూస్తున్నాం. కానీ జిల్లా రైతాంగం ముందస్తు ప్రణాళిక, అధికార యంత్రాంగం పకడ్బందీ పర్యవేక్షణ వెరసి నిర్మల్‌జిల్లాను యూరియాకొరత లాంటి ఇబ్బందికర పరిస్థితిల వైపు నుంచి షెడ్యూల్ ప్రకారం యూరియా అందిస్తూ అన్నదాతకు అండగా నిలిచేలా చేసింది.పలు జిల్లాలతో పోలీస్తేనిర్మల్ జిల్లాలో రైతాంగంముందస్తుగానే పంటలను సాగు చేయడం, ఆ పంటలకు సరిపడా ఎరువులను, మందులను అంచనా వేసి అధికారులు వాటిని షెడ్యూల్ ప్రకారం అందజేయడంలో సఫలీకృతులయ్యారని చెబుతున్నారు.అందుకే నిర్మల్ జిల్లాలో ఎక్కడ కూడా యూరియా కొరత అనేఅంశం తెరపైకి రాలేదంటున్నారు.

వర్షాకాలం పంటకు 35వేల మెట్రిక్‌టన్నుల యూరియా

నిర్మల్ జిల్లాలో ఈ వర్షాకాలంలో సాగు చేస్తున్న ఆయా రకాల పంటలకు 35 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు అంచనా వేశారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం యూరియాను షెడ్యూల్ ప్రకారం జిల్లాకు విడుదల చేసేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటి వరకు నిర్మల్ జిల్లాకు మొత్తం 24 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. కాగా జిల్లాలోని రైతులు వరి, పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, తదితర పంటల కోసం 21 వేల మెట్రిక్ టన్నుల యూరియాను ఇప్పటి వరకు ఉపయోగించి నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. జిల్లాలో పది వేల మెట్రిక్ టన్నుల డీఏపీని రైతులు వాడినట్లు చెబుతున్నారు. జిల్లాలో ఎంపీకే కాంప్లెక్స్ ఎరువులు 12వేల మెట్రిక్ టన్నులు వాడగా ఇంకా 800ల మెట్రిక్‌టన్నులు అందుబాటులోఉన్నట్లు చెబుతున్నారు.జిల్లాకు వచ్చిన 24 వేల మెట్రిక్ టన్నుల యూరియా నుంచి 21 వేలమెట్రిక్ టన్నుల యూరియానే ఇప్పటివరకుఉపయోగించడంతో మరో మూడువేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలో రైతులకు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబు తున్నారు. ఈ వర్షా కాలం పంటకు గాను ఇంకా11 వేలమెట్రిక్ టన్నుల యూరియాఅవసరం పడు తుం దని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

జిల్లాలో 3.87 లక్షల ఎకరాలల్లో ప్రధాన పంటల సాగు

ఈ వానకాలం సీజన్‌లో నిర్మల్ జిల్లాలో 3.87 లక్షల ఎకరాలలో ప్రధాన పంటలను సాగు చేస్తున్న ట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాల్లో వరి పంటను, 1.40 లక్షల ఎకరాల్లో పత్తి పంటను, 1.12 లక్షల ఎకరాల్లో సోయా బీన్ పంటను, 15 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట లను సాగు చేసినట్లు అధికారులు చెబుతు న్నారు. ఈ పంటలకు గాను జూలై మాసంలో 2,000 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు అదనంగా వాడినట్లు చెబుతున్నారు. ఆగస్టు మాసంలో యూరి యా వాడకాన్ని తగ్గించినట్లు చెబుతున్నారు. ఆగస్టు మాసంలో ఇప్పటి వరకు 1,000 మెట్రిక్ టన్నుల యూరియాను మాత్రమే వాడినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. ప్రస్తుతం పంటలకు సరి పడా షెడ్యూల్ ప్రకారం జిల్లాకు యూరియాను విడుదల చేస్తున్నట్లు చెబుతున్న అధికార యంత్రాంగం.

> **యూరియా కొరత లేకుండా పకడ్బందీ చర్యలు**
>
> ● అభిలాష అభినవ్, కలెక్టర్, నిర్మల్
>
> నిర్మల్ జిల్లాలో రైతులు సాగు చేస్తున్న పంటలకు సరిపడా యూరియాను షెడ్యూల్ ప్రకారం అందిస్తున్నాం. ఎక్కడ కూడా యూరియా కొరత లేకుండా చర్యలు చేపడు తున్నాం.యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలి పోకుండా రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం.

నానో యూరియా వైపు ప్రోత్సాహం

ఆయా ప్రధాన పంటలను సాగు చేస్తున్న రైతులు యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియాను వాడేలా అధికారులు ప్రోత్సహిస్తు న్నారు. ఇలా చేయడం ద్వారా యూరియా కోసం రైతులు తంటాలు పడే అవసరం ఉండదని చెబుతు న్నారు. భవిష్య తులో యూరియాకు బదులు నానో యూరియాను ఉపయోగించేందుకు మొగ్గుచూపుతా రని అధికార యంత్రాంగం చెబుతోంది.

పక్కదారి పట్టకుండా పకడ్బందీ చర్యలు

జిల్లాలో యూరియాకొరత నెలకొన్న నేప థ్యంలో నిర్మల్‌జిల్లాలో ఆ పరిస్థితి రాకుండా ఉండేం దుకు కారణం ముందస్తు ప్రణాళిక ఒకటైతే పకడ్బం దీ పర్యవేక్షణ మరొకటిగా నిలుస్తోంది. జిల్లాలో యూరియాను బ్లాక్‌లో విక్రయించకుండా అధికార యంత్రాంగం గట్టి నిఘాను ఏర్పాటు చేసింది. ఎప్ప టికప్పుడు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జా నకి షర్మిల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు ఫర్టిలైజర్ దు కాణాలలో ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

నిండుకుండలా గడ్డెన్నవాగు ప్రాజెక్టు

- ఒక వరద గేట్ ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల



ప్రాజెక్టు వరద గేట్ నుంచి సుద్దవాగులోకి వదిలిన వరద నీరు

భైంసా, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకున్న వరద నీటితో గడ్డెన్నవాగు ప్రాజెక్టు నిండు కుండలా మారింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు ఉండగా ప్రస్తుత ప్రాజెక్టు నీటి మట్టం 358.6 మీటర్లుగా ఉంది. ఇక ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.83 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1.772 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. నిండుకుండలా మారిన ప్రాజెక్టు జలకళను సంతరించుకోవడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. భైంసా పట్టణవాసులతో పాటు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో ప్రాజెక్టు వద్దకు తరలివస్తున్నారు. ఇక ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్ర నుంచి ప్రాజెక్టులోకి మూడు రోజులుగా 1127 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఇందుకు అనుగుణంగా ప్రాజెక్టు నిర్వాహణాధికారులు మూడు రోజులుగా ఒక వరద గేట్‌ను ఎత్తి దిగువన ఉన్న సుద్దవాగులోకి 1127 క్యూసెక్కుల నీటిని వదిలిపెట్టారు. ప్రస్తుత వానకాలంలో ప్రాజెక్టులోకి ఇంత వరకు 4,069 టీఎంసీ వరద నీరు వచ్చి చేరగా వరద గేట్ల ద్వారా ఇప్పటి వరకు 2.892 టీఎంసీల వరద నీటిని దిగువన ఉన్న సుద్దవాగులోకి వదిలిపెట్టారు. ప్రాజెక్టు ప్రాంతంలో ప్రస్తుత వానకాలపు సీజన్‌లో ఇప్పటి వరకు 692.89 మి.మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



చంద్రయాన్- 3 రాకెట్ నమూనాను విద్యార్థులకు వివరిస్తున్న సైన్స్ ఉపాధ్యాయులు

దిలావర్‌పూర్/భైంసా,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి):మండలంలోని సిర్గా పూర్ ఫ్లేయర్ హైస్కూల్‌లో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) విజయాలను, దేశ అంతరిక్ష పరిశోధనలు, దాని సహాయ సహకారాన్ని, అంతరిక్ష సాంకేతికత ప్రాముఖ్యతను సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా చంద్రయాన్- 3 రాకెట్ నమూనాను విద్యార్థులకు కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఇస్రో ప్రయోగించిన విజయవంతమైన కృత్రిమ ఉపగ్రహాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నరసింహ రెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.భైంసాలో విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర సాంకేతిక రంగాలపై పట్టు పెంపొందించుకోవాలని విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్ సీహెచ్ శివప్రసాద్ సూచించారు. శనివారం భైంసాలోని గోపాల్‌రావ్ పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. రాబోయే గగన్‌యాన్ మిషన్, చంద్రయాన్-3 ప్రాధాన్యతను వివరించారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ రఘునాథ్, అధ్యాపకులు శ్రావణ్య, రవికుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ముగిసిన శ్రావణ మాస ఉత్సవాలు

● కదిలి, కాల్వ ఆలయాల్లో ముగిసిన శ్రావణ మాస ఉత్సవాలు



కదిలి పాపహరేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

దిలావర్‌పూర్/భైంసా, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి) : కదిలి శ్రీ పాపహరేశ్వర స్వామి, కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాల్లో శ్రావణ మాస ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. జూలై 24న ప్రారంభమైన శ్రావణ మాసంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులుతమ ఇష్ట దైవాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి జిల్లా నలు మూలల నుంచే కాకుండా వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కాగా శ్రావణ మాసం చివరి శనివారం కావడం, అమావాస్య కలిసి రావడంతో కదిలి, కాల్వ ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. ఉదయం నుంచి ఆలయాలు కిక్కిరిసి పోయాయి. మధ్యాహ్నం మహా హారతి పూజలతో శ్రావణ మాస ఉత్సవాలు ముగిసినట్లు దేవాదాయ అధికారులు ప్రకటించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆయా దేవస్థానాల ధర్మకర్తల మండళ్లు తగిన ఏర్పాట్లు చేశాయి.భైంసాలో గత నెల 25న ప్రారంభమైన శ్రావణ మాసపు వేడుకలు శనివారం ముగిసాయి. నెల రోజుల పాటు వేడుకలు ఘనంగా కొనసాగాయి. భక్తులు ఆలయాలకు అధిక సంఖ్యలో తరలివెళ్లి భక్తిశ్రద్ధలతో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తులు నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టారు. శ్రావణ మాస ముగింపు వేడుకలను పురస్కరించుకొని భైంసా పట్టణ పరిధిలోని పలు ఆలయాల్లో భారీగా అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పాఠశాల ప్రారంభోత్సవానికి ఆహ్వానం



అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌ను ఆహ్వానిస్తున్న విద్యాశాఖ అధికారి

నిర్మల్ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భైంసా మండలంలోని బబుల్‌గాం పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌ను ఆహ్వానించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భైంసా మండల విద్యాధికారి సుభాష్, సారంగాపూర్ మండల విద్యాధికారి మహేందర్, రూరల్ మండల విద్యాధికారి వెంకటేశ్వర్, విద్యాశాఖ సమన్వయకర్త లింబాద్రి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా పరీక్షల బోర్డు సభ్యుల సమావేశం

నిర్మల్‌రూరల్,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లా పరీక్షల బోర్డు సభ్యుల సమావేశం శనివారం నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు తెలిపారు.ఈసందర్భంగా డీసీఈబీ సెక్రటరీ విజయ 2024-25 నివేదిక, 2025-26 విద్యా సంవత్సరంలో చేసే కార్య క్రమాల గురించి చర్చించినట్లు తెలిపారు.

స్వగ్రామానికి చేరిన జవాన్ మృతదేహం



అధికారిక లాంఛనంగా గాలిలోకి కాల్పులు



జవాన్ తల్లిదండ్రులను ఓదారుస్తున్న ముథోల్ ఎమ్మెల్యే

- అధికారిక లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు
- జవాన్‌కు నివాళులర్పించిన ముథోల్ ఎమ్మెల్యే
- కడసారి చూపుకు తరలివచ్చిన జవాన్ అభిమానులు, బంధువులు

ముథోల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజుల క్రితం దేశ వైమానిక దళం న్యూఢిల్లీలో పని చేస్తున్న జవాన్ ముథోల్ మండలం తరోడా వాసి లక్ష్మీ ఈశ్వర్ ప్రసాద్(25)తోటి సహ ఉద్యోగులతో కలిసి ఆగ్రా దగ్గర దమ్మ వాటర్ ఫాల్‌కి వెళ్లగా ప్రమాదవ శాత్తు వాటర్ ఫాల్‌లో పడి చనిపోయాడు. శనివారం వేకువ జామున జవాన్ మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. అంత్యక్రియలు స్వగ్రామంలో అధికారిక లాంఛనాలతో పూర్తయ్యాయి. ఎయిర్ ఫోర్స్ అధికారి ప్రవీణ్ సింగ్‌చౌహాన్ ఆధ్వర్యంలో మృతదేహంపై ముందుగా ఎయిర్ ఫోర్స్ జవాన్లు త్రివర్ణ పతాకాన్ని శవ పేటికపై కప్పి, పుష్పగుచ్చం వేసి నివాళుల ర్పించారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ జవాన్ పార్థివ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళు లర్పించారు.జవాన్ తల్లిదండ్రులను ఓదార్చారు. కడ సారి చూపు కొరకు మృతుడి కుటుంబ సభ్యులు, బం ధువులు, గ్రామస్థులు, అభియానులు ఆయా గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై శవ యాత్రలో పాల్గొన్నారు. లక్ష్మీ ఈశ్వర్ ప్రసాద్ అమరహై, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.ఎయిర్‌ఫోర్స్ జవాన్లు మూడు రౌండ్లు గాలిలో కాల్పులు జరిపి అధి కారిక లాంఛనాలతో అంత్యక్రియలు ముగించారు. అనంతరం చితికి మృతుడి తండ్రి నిప్పంటించారు. చేతి కొచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు, రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.ఈకార్యక్రమంలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, సీఐ మల్లేష్, ఎస్సై బిట్ల పెర్సిస్, సుమారు 50వరకు ఎయిర్‌ఫోర్స్ జవాన్లు,తదితరులు పాల్గొన్నారు.



ఓ పెళ్లిలో వధువుకు పుస్తె, మట్టెలు, పట్టుచీర అందజేస్తున్న కృష్ణంరాజు (ఫైల్)

- పేదల పెళ్లిళ్లకు చేయూత
- అండగా నిలుస్తున్న కృష్ణంరాజు
- ఓకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విస్తరిస్తున్న సేవా కార్యక్రమాలు

పరిమళిస్తున్న
మానవత్వం



సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న కృష్ణంరాజు (ఫైల్)

నిర్మల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాకు చెందిన ఓకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాప కుడు ఒడ్డేపల్లి కృష్ణంరాజు గత కొంత కాలం నుండి పేదల పెళ్లిళ్లకు పెద్దగా నిలబడుతూ తన మానవత్వాన్ని చాటుకుంటున్నాడు. పేద కుటుంబాలకు చెందిన వధువుకు పుస్తె, మట్టెలు ఉచితంగా అందించి ఆ కుటుంబానికి అండగా నిలుస్తున్నాడు. ఇప్పటి వరకు దాదాపు 50 పేద కుటుంబాలకు చెందిన పెళ్లి కూతుళ్లకు ఆయన ఉచితంగా పుస్తె, మట్టెలు అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. అలాగే పేదల పెళ్లి భోజనాలకు సంబంధించిన ఆహార వస్తువులను కూడా ఆయన ఉచితంగా పంపిణీ చేస్తున్నాడు. గత ఆరేళ్ల నుండి ఆయన ఖానాపూర్, నిర్మల్ పట్టణాల్లో తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ఔదార్యాన్ని చాటుకుంటున్నాడు. అలాగే ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి పేదల పెళ్లిళ్లకు హాజరై వారిని ఆశీర్వదిస్తున్నాడు. దీంతో పాటు ఆపదలో ఉన్న వారికి సైతం ఆయన ఆర్థిక సహాయం అందిస్తున్నాడు.

వైద్య సహాయక చర్యలతో ప్రత్యేక గుర్తింపు...

గతంలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి అల్లోల ఇంద్ర కరణ్ రెడ్డి వద్ద పర్సనల్ సెక్రటరీగా పని చేసిన ఒడ్డేపల్లి కృష్ణంరాజు అప్పటి నుండే నిర్మల్ జిల్లాలోని పేదలకు అవసరమయ్యే వైద్య సేవలకు సంబంధించి సహకారాన్ని అందించేవాడు. ముఖ్యంగా సీఎంఆర్ఎఫ్ నిధుల మంజూరు విషయమే కాకుండా జిల్లాకు చెందిన పేద, మధ్య తరగతి వారు వైద్య చికిత్సల కోసం హైదరాబాద్ వస్తే వారికి ఆయన అండగా ఉండి అక్కడి ఆసుపత్రి యాజమాన్యాలతో మాట్లాడి బిల్లులలో భారీగా డిస్కౌంట్ ఇప్పించేవాడు. అవసరమైతే అక్కడ అదనపు చికిత్సల కోసం ఆర్థిక సహాయం కూడా అందించి తన దాతృత్వాన్ని చాటుకునేవాడు. అలాగే పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం అవసరమైన పూర్తి సహకారాన్ని అందించి ఆయన అండగా నిలుస్తున్నాడు. ఉచితంగా పుస్తకాలు, ఇతర వస్తువులను అందించడమే కాకుండా అత్యంత పేద విద్యార్థులకు పాఠశాలలు, కళాశాలల్లో ఫీజులలో కూడా మినహాయింపులు అయ్యేట్లు సహకరి స్తున్నాడు. ఇలా దాదాపు దశాబ్ద కాలం నుండి ఓకేఆర్ ఫౌండేషన్ పేరిట కృష్ణంరాజు అందిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఫోరమ్ ఫర్ సోషల్ సర్వీస్, అభ్యుదయ సామాజిక సేవా సంస్థలు ఆయ నను సన్మానించాయి.

గిరిజన విద్యార్థులకు అండగా...

కాగా ఓకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృష్ణంరాజు ఇప్పటికే జిల్లాలోని మారుమూల తండాలు, గూడెంలలో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు అందించి వారిని చదువు వైపు ప్రోత్సహించారు. ఖానాపూర్ మండలంలోని కొలాంగూడ గిరిజన గ్రామంలోని 40 మంది విద్యార్థులకు కృష్ణంరాజు తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా బ్యాగులు, స్టేషనరీ సామాగ్రిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రెండు రోజుల పసికందు మృతి

భైంసా, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు ఆరోగ్యాలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చర్యలు చేపడుతున్నప్పటికి మరణాల ఘటనలు మాత్రం ఆగడం లేదు. శనివారం భైంసాలో రెండు రోజుల శిశువు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన చోటు చేసుకుంది. బాసర మండలంలోని సాలాపూర్ గ్రామానికి చెందిన పూజ అనే మహిళ భైంసాలోని ఏరియా ఆస్పత్రిలో గురువారం ఆడబిడ్డను ప్రసవించింది. తొలి కాన్పులో ఆడ శిశువు జన్మించగా మలికాన్పులో సైతం ఆడశిశువు పుట్టింది. శిశువు ఊపిరితిత్తుల సమస్యతో అనారోగ్యంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఫలితం లేకపోగా నిజామాబాద్ తరలించారు. కోలుకోకపోవడంతో శనివారం భైంసాలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. భైంసా ఏరియా ఆస్పత్రితో పాటు, నిజామాబాద్ ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు శిశువు ఆరోగ్యం కోసం చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవ్వమవ్వడంలో శిశువు ప్రాణాలు కాపాడలేక పోయారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్‌రూరల్/మామడ,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి):నేడు (ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు.భాగ్యనగర్‌లో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చుటకు గాను ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భాగ్యనగర్, మీసేవ,శరత్ మహల్, మదీనా కాలనీ, ఈద్‌గాం ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంత రాయం ఉంటుందని తెలిపారు.

మామడ మండలంలోని మామడ, పరిమండల్, తాండ్ర, కొరిటికల్, మేడిపల్లి గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ బాలయ్య తెలిపారు.

విద్యార్థి మృతి ఘటనపై విద్యాశాఖ విచారణ

భైంసా, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పబ్జీ గేమ్‌కు బానిసగా మారిన విద్యార్థి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై విద్యాశాఖ విచారణ చేపట్టింది. బుధవారం సాయంత్రం వేళలో భైంసాలోని ఆనంద్‌నగర్ కాలనీ పరిధిలో నివాసముంటున్న బేతి రిశేంద్ర అనే విద్యార్థి ఉరి వేసుకొని తనువు చాలించాడు. హైదరాబాద్‌లోని మౌళాలి ప్రాంతంలో గల బాష్యం స్కూల్‌లో 9 వ తరగతి పూర్తి చేసుకున్న సదరు విద్యార్థి పదో తరగతి చదువుకోవడానికి వెళ్లకుండా పబ్జీ వ్యసనం బారిన పడి ప్రాణాలు తీసుకున్నాడు. సంబంధిత ఘటనపై జి ల్లా విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు భైంసా ఎంఈవో సుభాష్ విచారణ చేపట్టారు.

యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలి

ఇచ్చోడ, ఆగస్టు, 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులందరూ యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని యోగా ఇన్‌స్ట్రక్టర్ కొలిపాక సాయి అన్నారు. శనివారం మండలంలోని గేర్జం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించి విద్యార్థులకు యోగా తరగతులను నేర్పించారు. ప్రతి రోజు యోగాను అలవాటు చేసుకోవాలని, యోగా అంటే మనస్సును, శరీరాన్ని, ఆత్మను ఏకం చేస్తుందన్నారు. విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు బత్తుల భూమన్న పాల్గొన్నారు.

సకాలంలో విధులకు హాజరుకాని సిబ్బందిపై చర్యలు

బోథ్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించి కొంతమంది సిబ్బంది విధులకు గైర్హాజరుకావడంతో పాటు సకాలంలో విధులకు రావడం లేదని, వారిపై చర్యలు తప్పవని బోథ్ ఆసుపత్రి సూపరిండెంట్ రవికుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయనమాట్లాడుతూ వివిధ రకాల పరీక్షలు నిర్వహించి సిబ్బంది సకాలంలో విధులకు రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు రావడంతో సిబ్బందికి మెమోలు జారీ చేశామన్నారు. టీ బి,హెచ్ ఐవి తదితర పరీక్షలు నిర్వహించి ల్యాబ్ ఆపరేటర్లు ప్రతిరోజు 9:30 గంటలకు ఆసుపత్రిలో ఉండాలన్నారు. అంతేగాక సాయంత్రం మూడు గంటలకు వెళ్లాల్సి ఉంటుందని అంతకంటే మొదలుగా వెళ్ళవద్దని సూచించామన్నారు.

పల్లె జాతర ఎన్నికల స్టంట్

బోథ్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామాలలోకి వెళ్లి ప్రజలను తప్పుతోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు ప్రవీణ్ ఓ ప్రకటనలో ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన పాలక ప్రభుత్వం కొత్త ఎత్తుగడవేసి పనిలేని పనుల జాతర చేపట్టారన్నారు. పాలకులు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు.

నాగోబా ఆలయంలో పూజలు చేసిన జీసీసీ చైర్మన్



ఆదివాసీ అమరవీరులకు నివాళులర్పిస్తున్న జీసీసీ చైర్మన్

ఇంద్రవెల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో శనివారం పొలాల పండుగను పురస్కరించుకుని జీసీసీ చైర్మన్ కొట్నాక్ తిరుపతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు శాలువాలతో సన్మానం చేసి నాగోబా ప్రతిమను అందించారు. కేస్లాపూర్ గ్రామంలో నిర్వహించిన పొలాల పండుగ వేడుకలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా మార్గమధ్యలో ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పుర్క బాపూరావు, రగల్ జెండా ఆశయ సాధన కమిటీ అధ్యక్షులు తొడసం నాగోరావు, తుడుందెబ్బ నాయకులు జుగ్నాక్ భారత్ గేడం భారత్, కనక గణేష్ ఉన్నారు.

బాసర రైల్వేస్టేషన్‌లో జీఎం తనిఖీ



బాసర రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేస్తున్న రైల్వే జీఎం

బాసర, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : బాసర రైల్వేస్టేషన్‌ను శనివారం సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీ వాస్తవ తనిఖీ చేశారు. ప్రత్యేక రైల్లో రైల్వే ఇతర విభాగాల ఉన్నతాధికారులతో బాసరకు చేరుకున్న ఆయన స్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్‌లో ప్రయాణికులు సౌకర్యాలను తనిఖీ చేశారు. అమృత్‌భారత్ స్టేషన్ పథకంలో భాగంగా చేపట్టిన స్టేషన్‌లో కొనసాగుతున్న పునరాభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. జీఎం వెంట సౌత్ సెంట్రల్ వివిధ విభాగాల రైల్వే ఉన్నతాధికారులు బాసర రైల్వేస్టేషన్ అధికారులు ఉన్నారు.

యూరియా సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

● ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్

నిర్మల్ రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : యూరియా సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ... అన్నం పెట్టే రైతులకు ఎరువుల కోసం గంటల తరబడి క్యూ కట్టాల్సిన దుస్థితి ఎందుకు వచ్చిందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ సాదిక్, వినోద్, హైమద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

దిలావర్‌పూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని మండల పంచాయతీ అధికారి గోవర్ధన్ లబ్ధిదారులను కోరారు. శనివారం న్యూ లోలంలోని ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. దశల వారీగా లబ్ధిదారులకు నిర్మాణ బిల్లులు వస్తాయని చెప్పారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరం సందర్శించారు. మండల మెడికల్ ఆఫీసర్ డా. ప్రియాంక గ్రామంలో ఉన్న వైరల్ జ్వరాలు, చికిత్సల వివరాలను ఎంపీవోకు వివరించారు. గ్రామస్థులు పరిశుభ్రతను పాటించాలని, సీజనల్ వ్యాధులు వస్తే వెంటనే ఆరోగ్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, చికిత్స పొందాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ ఉన్నారు.

విద్యార్థులు సాంకేతికంగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్

భైంసా, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర సాంకేతిక రంగాలపై పట్టు పెంపొందించుకోవాలని విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్ సీహెచ్ శివప్రసాద్ సూచించారు. శనివారం భైంసాలోని గోపాల్‌రావ్ పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన జాతీయ అంతరిక్ష దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. అంతరిక్ష రంగంలో దేశం సాధించిన విజయాలను వివరించారు. రాబోయే గగన్‌యాన్ మిషన్, చంద్రయాన్-3 ప్రాధాన్యతను వివరించారు. శాస్త్ర, సాంకేతిక రంగాలపై అవగాహన పెంపొందించుకుని కొత్త ఆవిష్కరణల దిశగా అడుగులు వేయాలని ప్రోత్సహించారు. ఆదర్శనీయ వ్యక్తుల జీవితాలను చదువుతు వారి మార్గంలో పయనించి భవిష్యత్తును బంగారు మయం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఇందులో కళాశాల ప్రిన్సిపాల్ కర్రొల్ల బుచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ రఘునాథ్, అధ్యాపకులు శ్రావణ్య, రవికుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా పొలాల అమావాస్య



జిల్లా జైలులో ఆవులకు నైవేద్యం

పొలాల పండుగను రైతన్నలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే రైతులు వాగులలో బసవన్నలకు స్నానాలు చేయించి, ప్రత్యేకపూజలు చేశారు. ఆలయాల చుట్టు బసవన్నలతో ప్రదక్షిణలు చేయించి ఇంటి వద్ద నైవేద్యాలు పెట్టి భక్తిశ్రద్ధలతో బసవన్నలకు పూజలు చేశారు.



రాజురలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్



వడూర్‌లో రైతుకు సన్మానం



ఆదిలాబాద్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు



బసవన్నలతో ప్రదక్షిణలు చేస్తున్న రైతులు

భార్య మృతి చెందిన బావిలోనే భర్త ఆత్మహత్య

తలమడుగు , ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బరంపూర్ శివారు ప్రాంతంలో గల బావిలో పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు తలమడుగు ఎస్ఐ రాధిక తెలిపారు. ఆమె తెలిపిన ప్రకారం... ఆదిలాబాద్ పట్టణానికి చెందిన జాదవ్ దేవిశ్రీ ప్రసాద్ అనే వ్యక్తి (27) ఆదిలాబాద్‌లో ఐటీఐ కాలేజ్‌లో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం బరంపూర్ శివారు ప్రాంతంలో పడి ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. కాగా అతని భార్య గత నెల జూలై 10 బరంపూర్ లోని గ్రామ శివారులో గల బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. అప్పటినుంచి అత్తింటి కుటుంబసభ్యులు చంపేస్తామని బెదిరించినట్లు మృతుడి బంధువులు తెలిపారు. మనస్థాపం చెంది దేవి శ్రీ ప్రసాద్ తన భార్య చనిపోయిన అదే బావిలో దూకి చనిపోయాడు. మృతుని తల్లి సింధుతాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తలమడుగు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కమల్‌సింగ్

కుంటాల, ఆగస్టు, 23 : (ఆంధ్రజ్యోతి) :త్వరలో జరుగనున్న వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్సై అశోక్, తహసీల్దార్ కమల్ సింగ్‌లు అన్నారు. శనివారం మండల కేంద్రం కుంటాలలో వినాయక మండపాల నిర్వాహకులచే శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన మొదలు కొని నిమజ్జనం వరకు ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో వినాయక మండపాల వద్ద పోలీసు వారి తరఫున సూచనలు, సలహాలు అందించడం జరుగుతుందని ఎస్సై పేర్కొన్నారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులు అందించే సూచనలు, సలహాలు పాటించాలన్నారు. వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, తదితరులు ఉన్నారు.

నాణ్యతతో కూడిన పనులు చేయండి

బోథ్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మిస్తున్న కోర్టు భవనం పనులను న్యాయవాదులతో కలిసి అదిలాబాద్ జిల్లా జడ్జి కే.ప్రభాకర్ రావు పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షులు రామన్ రావు,, థిస్ పాండే కార్యదర్శి పంద్రం శంకర్, న్యాయవాదులు సుభాష్ మోహన్ రావు హరీష్ కుమ్మరి విజయ్ రాజు, మహేష్ సూపరిండెంట్ శేఖర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి

బోథ్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని పరిచయ గార్డెన్లో శనివారం విమలాకర్ ఫౌండేషన్ కిమ్స్ రిసార్ఫ్ అండ్ ఫౌండేషన్ సెంటర్ సౌజన్యంతో పీపుల్స్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ జీవనశైలిపై ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు.

బీరు బాటిల్‌తో దాడి, ఒకరికి తీవ్ర గాయాలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పంజాబ్ చౌరస్తా వద్ద ఇరువురు గొడవపడి బీరు బాటిల్‌తో దాడి చేసుకున్నారు. క్రాంతినగర్‌కు చెందిన జహీర్ మహారాష్ట్రకు చెందిన ఇసాక్ మధ్య డబ్బుల విషయమై గొడవ చోటు చేసుకుంది. దీంతో కోపోద్రిక్తుడైన ఇసాక్ బీరు బాటిల్ పగలగొట్టి జహీర్‌పై విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. గాయపడ్డ జహీర్‌ను 108 అంబులెన్స్ సిబ్బంది రిమ్స్‌కు తరలించారు.

వైన్స్‌లో చోరీ

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వైన్స్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు టూ టౌన్ సీఐ కె .నాగరాజ్ తెలిపారు. దుకాణం పైకప్పు రేకులు తొలగించి దొంగలు లోనికి చొరబడ్డారు. రూ.20 వేలు, సెల్ ఫోన్, డీవీఆర్ చోరీ చేసినట్లు తెలిపారు. వైన్ షాప్ యజమాని ఆశ శివ రాజా గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

క్యాన్సర్‌తో యువకుడి మృతి

లక్ష్మణచాంద, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామానికి చెందిన పులి అన్వేష్(18) అనే యువకుడు బోన్ క్యాన్సర్‌తో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న యువకుడు గత కొంతకాలంగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు చేయించుకున్నా ఫలితం లేకుండా పోయింది. మృతుడి తండ్రి గతంలోనే పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. అన్వేష్ మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మట్టి వినాయకుల తయారీపై శిక్షణ

ఖానాపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణానికి హితం చేయవచ్చని మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోనగిరి నరేందర్ రావు అన్నారు. శనివారం మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మట్టి వినాయకుల తయారీపై ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు మట్టి వినాయకులను తయారుచేసి అందరి మన్ననలను చూరగొన్నారు. వినాయకుల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పాటు ఆకర్షణీయంగా కనిపించే ప్రమాదకరమైన రంగులను వాడడంతో పర్యావరణానికి తీవ్రమైన నష్టం కలుగుతుందన్నారు. భూగర్భ జలాలు, నదులు కలుషితం కాకుండా ఉండాలంటే మట్టి వినాయకులను మాత్రమే వాడాలని కోరారు. పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణతో విద్యార్థులు తయారు చేసిన వినాయకులను వారి వారి ఇంటిలో పూజిస్తామని, మిగిలిన వాటిని ఉచితంగా పంపిణీ చేస్తామని బోనగిరి నరేందర్ రావు తెలిపారు. ఈ తయారీ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కుర్ర శేఖర్, వెన్నం అంజయ్య, ప్రకాష్, తదితరులున్నారు.



శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

● ఖానాపూర్ ఎంపీడీవో రత్నాకర్ రావు



న్యూ లోలంలో ఇందిరమ్మ గృహ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీవో

ఖానాపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు ఎంపీడీవో చిక్కాల రత్నాకర్ రావు సూచించారు. శనివారం మండలంలోని రంగాపేట్, ఎర్వచింతల్, కొలాంగూడ, పాత ఎల్లాపూర్, దిలావర్‌పూర్ గ్రామ పంచాయతీల పరిధిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎల్ వన్ జాబితాలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులను, పారిశుద్ధ్య సిబ్బందిని ఎంపీడీవో ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా చేయడంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే స్థానిక పంచాయతీ కార్యదర్శి ద్వారా లెటర్ తీసుకొని తహసీల్దార్ అనుమతి పొందాలన్నారు. ఈ వేరువేరు కార్యక్రమాల్లో మండల ఈ పంచాయతీ ఆపరేటర్ సాగర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు దివ్య, భోజన్న, దేవేందర్ రెడ్డి, హనుమంతు, మహేష్ ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలున్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

నర్సాపూర్(జి), ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నూతన ప్రధానోపాధ్యాయుడిగా ఎం. రవీందర్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన బి.పురుషోత్తం లింబా(కే) జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. నూతన ప్రధానోపాధ్యాయుడు రవీందర్ కుమార్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులున్నారు.

మట్టి విగ్రహాలు వాగులో నిమజ్జనం

కుంటాల, ఆగస్టు, 23 : (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో కాలుష్యాన్ని నివారించాలనే ఉద్దేశంతో ఆ గ్రామస్తులు మట్టితో తయారు చేసిన ఎడ్లకు మాత్రమే పూజలు నిర్వహించారు. అనంతరం సమీప వాగులో నిమజ్జనం చేశారు. కుంటాల మండలంలోని దౌనెల్లి గ్రామానికి చెందిన నేతకాని కులస్తులు పొలాల అమావాస్యను పురస్కరించుకొని పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో మట్టితో ఎడ్లను తయారు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎడ్లకు పూజలు నిర్వహించిన గ్రామస్తులు శనివారం రోజు పూజలు నిర్వహించిన ఎడ్లను స్థానిక వాగులో నిమజ్జనం చేశారు. దీంతో పక్క గ్రామాల ప్రజలు వీరిని ఆదర్శంగా తీసుకొని రాబోయే రోజుల్లో గణేష్ ప్రతిమలను మట్టితో తయారు చేసిన వాటికి పూజలు నిర్వహించి వాగులో, చెరువులో నిమజ్జనం చేస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు.

కడెంలో శాంతి కమిటీ సమావేశం

కడెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి నవరాత్రులను భక్తి శ్రద్ధలతో, శాంతియుతంగా జరుపుకోవాలని కడెం తహసీల్దార్, కడెం ఎస్సై తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించి, పలు సూచనలు ఇచ్చారు. నిర్వాహకులు అనుమతి తీసుకోవాలని, విద్యుత్ తీగలతో జాగ్రత్తగా ఉండాలని, ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా పండుగ చేసుకోవాలని సూచించారు. అధి కారులకు, పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఖానాపూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను బాధ్యతగా భావించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆనందం అన్నారు. శనివారం ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఆరోగ్యం - పరిశుభ్రత' అనే అంశంపై విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ... విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సంతోష్ రెడ్డి, స్టూడెంట్ కౌన్సిలర్ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాస భజన ముగింపు సందర్భంగా తిలక్‌నగర్ లోని పంచముఖి హనుమాన్ ఆలయంలో కార్యక్రమాలు నిర్వహించారు. పూజారి రామగిరి చంద్రకాంతయ్య, భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

బడీడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : బడీడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలని పనిలో కాదని శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా అన్నారు. అపరేషన్ ముస్కాన్‌లో గుర్తించిన బాలుడు మినుగు శివకుమార్ ను శనివారం ప్రభుత్వ పాఠశాల నంబర్ టూలో 10వ తరగతిలో అడ్మిషన్ కల్పించారు. గతంలో గుర్తించిన బాలుడు డ్రాప్ అవడంతో ఆయనను తిరిగి పాఠశాలలో చేర్పించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్‌కు సూచించారు. బాలల సంరక్షణ అధికారులు వారంలో ఒకసారి వచ్చి బాలుడి యాక్టివిటీలను గమనించాలన్నారు. ఆమె వెంట చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ సతీష్, కౌన్సిలర్ పద్మ ఉన్నారు.

బంధన్ బ్యాంకు పదో వార్షికోత్సవం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : బంధన్ బ్యాంకు పదో వార్షికోత్సవ వేడుకలను పట్టణంలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను అధికారులు వివరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు సాధించినట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. పదో వార్షికోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ వెంకట్, బ్రాంచ్ మేనేజర్ రాజ్‌కుమార్, సిబ్బంది వినయ్, శ్రీకాంత్, వంశీ, జగదీష్, సాయి పాల్గొన్నారు.

సురవరం మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ మాజీ జాతీయ ప్రధానకార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు, ప్రజా పోరాటాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ పేర్కొ న్నారు. 1998, 2004లో రెండుసార్లు ఎంపీగా సేవలందించిన ఆయన.. పార్లమెంట్‌లో పేదల గళాన్ని వినిపించారన్నారు.

ఆస్పత్రిలో అన్నదానం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణ బీజేపీ నాయకులు లాలా మున్న జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. రిమ్స్‌ఆస్పత్రి ఆవరణలో రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటారు. అదేవిధంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిరుపేదలకు అన్నదానం చేసి వారి నడుమ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో లాలా అర్జున్, అనికేత్, కరణ్ జైస్వాల్, సన్నీ సాయి తేజ, అబ్దుల్ అజీజ్ ఉన్నారు.

ఘనంగా ఆడే గజేందర్ జన్మదిన వేడుకలు

సిరికొండ రూరల్ , ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు ఆడే గజేందర్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ ఇమామ్, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ మండల అధ్యక్షులు కుర్మా సదానందం, మాజీ మండల కంచం లక్ష్మణ్ పాల్గొన్నారు

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఇంద్రవెల్లి , ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం జాతీయ అంతరిక్షం దినోత్సవాన్ని నిర్వహించారు. సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు తొడసం కైలాస్ ఇస్రో చిత్ర పటాలను ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మూఢవిశ్వాసాలను విడనాడి శాస్త్రీయ ఆలోచనలతో ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాదవ్ అశోక్ కుమార్, ఉపాధ్యాయులు తొడసం కైలాస్ జాదవ్ దశరథ్, కుమ్ర కేశవ్, రాజ్ మోహన్, కైలేశ్వరి, శైలజ పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ముథోల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ మండలంలోని ఆష్టా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్నం సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలను ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఆగస్టు 23వ తేదీన సీపీఎస్ వ్యతిరేక దినంగా నిరసన చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయి రెడ్డి, వేణుగోపాల్, రామ్మోహన్, భూమన్న, సురేష్, నవీన్, తదితరులున్నారు.

ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

తానూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నవతెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్ శనివారం మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు స్కూల్‌లో బుక్స్ యూనిఫామ్స్ దందాని అరికట్టాలి అని అన్నారు. ప్రయివేటు స్కూల్ విద్యాసంస్థలు ఫీజు దోపిడీ షురు చేశాయని, విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్ల దడ ఫీజులు దడ పుట్టిస్తున్నాయని అన్నారు. ఈయన వెంట మండల నవ తెలంగాణ విద్యార్థి సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, నవీన్, తదితరులున్నారు.

ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా సోయా

కుభీర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలం పాటు ఆదాయాన్నిచ్చే ఆయిల్ ఫామ్ సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు. మొక్కలు నాటిన మూడేళ్ల తర్వాత దిగుబడులు ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు సోయాబీన్, మొక్కజొన్న, జొన్న, కూరగాయల పంటలను అంతర పంటలుగా సాగు చేస్తున్నారు. మండలంలో సుమారు 411 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను రైతులు సాగు చేస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన చెందిన గిరి దత్తాత్రి అనే రైతు మూడేళ్ల కిందట మూడెకరాల విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ సాగు చేపట్టి అందులో సోయాబీన్‌ను అంతర పంటగా సాగు చేస్తూ మండల రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఆర్‌టీసీ సేవలను వినియోగించుకోవాలి

కుభీర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌టీసీ ఆధ్వర్యంలో చేపడుతున్న విహార యాత్ర సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌టీసీ భైంసా డిపో సూపరింటెండెంట్ అజ్మీరానాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 30న ధర్మపురి, కొండగట్టు, వేముల వాడ పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు ఆర్‌టీసీ బస్సు వసతి కల్పించామన్నారు. పెద్దలకు రూ. 600, చిన్నారులకు రూ. 300 టికెట్ ఉంటుందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వృద్ధుల కోసం వసతి కల్పించామన్నారు. 35 మంది ప్రయాణికులకు తీర్థయాత్రకు సిద్ధమైతే ప్రముఖ పుణ్యక్షేత్రాలు పండరి పురం, తుల్జాపూర్ భవాని క్షేత్రాలకు సైతం బస్సు వసతి కల్పిస్తామన్నారు. ఆర్‌టీసీ ప్రయాణం సురక్షిత ప్రయాణమని పేర్కొన్నారు. ఆయన వెంట సిబ్బంది శ్రీనివాస్, నాయకులు పుప్పాల పీరాజీ, చావన్ సంజయ్ తదితరులున్నారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ అజ్మీరానాయక్



మండలానికి మొదటి దశలో
155 ఇళ్లు మంజూరు

● రాంప్రసాద్, ఎంపీడీవో ఉట్నూర్

ప్రశ్న: మండలానికి ఇందిరమ్మ ఇండ్లు ఎన్ని మంజూరయ్యాయి...?

జవాబు: ఉట్నూరు మండలానికి మొదటి దశలో మత్తడిగూడా గ్రామపంచాయతి పరిధిలో 155 ఇళ్లు మంజూరయ్యాయి. రెండో దశలో 540 ఇండ్లు మంజూరు అయ్యాయి.

ప్ర: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ప్రక్రియ సజావుగా జరిగిందా....?

జ: అర్హులైన, ఇండ్లు లేని పేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేశాం. పూర్తి పారదర్శకంగా అసలైన లబ్ధిదారులను గుర్తించాం. ఇసుక సమస్య వల్ల ఇంకా ఇండ్ల పనులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి.

ప్ర: పీవీటీజీ గిరిజనులకు ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి?

జ: పీవీటీజీ గిరిజనులు అయినా కొలాం తోటి తెగ గిరిజనులకు 990ఇండ్లు మంజూరు అయ్యాయి. ఇవి కాకుండా ప్రత్యేకంగా ఐటీడీఏ ద్వారా గిరిజనులకు మాత్రమే 270ఇళ్లు మంజూరయ్యాయి.

ప్ర: మండలానికి పనుల జాతర కార్యక్రమాల ద్వారా ఎలాంటి పనులు చేపడుతున్నారు...?

జ: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనుల జాతర కార్యక్రమం కోసం 19 పనులు రూ.18 లక్షలతో మంజూరు అయ్యాయి. ఈ కార్యక్రమంలో పౌల్ట్రీ షెడ్లు క్యాటిల్ షెడ్స్ గోట్ హెడ్స్ ఇంకుడు గుంతలు లాంటివి చేపట్టడం జరుగుతుంది. పంచాయతీ రాజ్‌శాఖ ద్వారా గ్రామ పంచాయతీ భవనాలు అంగన్వాడి స్కూల్స్ భవనాలు సీసీ రోడ్లు చేపట్టడం జరుగుతుంది.

● (ఉట్నూర్, ఆంధ్రజ్యోతి)

ఘనంగా మంటెడ్ల పండుగ

బజార్హత్నూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం గ్రామస్థుల ఆధ్వర్యంలో మట్టితో తయారు చేసిన మంటెడ్ల పండగ ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. పొలాల అమావాస్య పండగ జరిగిన రెండవ రోజు ఈ మంటెడ్ల పండగ జరుపుకోవడం గ్రామంలో ఆనవాయితీగా వస్తోంది. మట్టి, కర్రలతో అందంగా ముస్తాబు చేసిన బసవన్నల(ప్రతిమల)ను ఒక్క దగ్గరకు చేర్చి పూజలు నిర్వహించారు. అనంతరం డప్పుల చప్పుళ్లతో బసవన్నలను నెత్తిపై మోస్తూ ఆంజనేయ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా రైతులు, యువకులు కోలాటంపై పల్లె పాటలు పాడుతూ నృత్యాలు చేయడం అందరినీ ఆకట్టుకుంది. పండగను చూడటానికి గ్రామమంతా కదిలింది. దీంతో గ్రామంలో సందడి వాతావరణం సంతరించుకుంది.

భక్తుల కొంగు బంగారం..
పాలాజ్ గణేషుడి దర్శనం

» కర్ర గణేషుడికి వైభవంగా పూజలు
» ఏటా పెరుగుతున్న భక్తులు
» 11 రోజుల పాటు విశేష పూజలు
» సత్యదేవుడిగా ప్రసిద్ధి
» పాలాజ్ బాట పట్టనున్న భక్తులు

కుభీర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉన్న పాలజ్ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఇక్కడి వినాయకుడు కోరిన కోర్కెలు తీర్చే ఆది దేవుడిగా ప్రసిద్ధి చెందాడు. కుభీర్ మండలానికి సరిహద్దున ఉన్న మహారాష్ట్రలోని భోకర్ తాలూకా పాలాజ్ గ్రామంలో 1948లో కర్ర గణేశుడిని ప్రతిష్ఠించారు. వినాయక చవితి సందర్భంగా పదకొండు రోజుల పాటు పూజలందుకోనున్న ఈ కర్ర వినాయకుడిని దర్శించుకునందుకు ఏటా లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఇందుకోసం ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తుంది. క్యూలైన్లూ మంచి నీటి సౌకర్యం, పార్కింగ్, ప్రసాద వితరణ తదితర సౌకర్యాలు భక్తులకు కల్పిస్తున్నారు. పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాన్ని సైతం కేటాయించారు. జిల్లా వాసుల కోసం భైంసా, నిర్మల్, ఆదిలాబాద్ ఆర్టీఈసీ డిపోల నుండి ప్రత్యేక బస్సులు ఇక్కడికి రాకపోకలు సాగిస్తాయి. పొరుగుల జిల్లాల వాసులు కూడా భైంసా మీదుగా పాలాజ్ గ్రామానికి చేరుకోవచ్చు.

● అందమైన రూపంలో వినాయకుడు...

కర్ర గణనాథుడు రూపం అందంగా ఉంటుంది. పెద్ద చెవులు, నాలుగు భుజాల ఆకారంలో ఉంటారు. కుడి చేతిలో గండ్ర గొడ్డలి, మరో చేతితో ఆశీర్వాదమిస్తూ ఎడమ చేతితో త్రిశూలం, మరో చేతిలో లడ్డూతో దర్శనమిస్తాడు. ఎడమ కాలుపై కూర్చోని ముస్తాబుగా కనిపిస్తాడు. ఈ విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది.


ఆలయంలో కొలువు దీరిన గణనాథుడు

● గ్రామమంతా రోగాలే

స్వాంత్ర్యం రాక ముందు గ్రామంలో ప్లేగు, కలరా వ్యాధులు ప్రబలయి. పలు మార్లు వైద్య పరీక్షలు నిర్వహించుకున్న నయకం కాక పోవడంతో చాలా మంది గ్రామస్తులు ప్రాణాలు కోల్పోయారని అక్కడి పెద్దలు చెబుతున్నారు. అంతలోనే వినాయక చవితి వచ్చింది. దీంతో గ్రామస్తులంతా ఒక నిర్ణయానికి వచ్చి కర్ర గణేష్ విగ్రహాన్ని చేయిద్దామని నిర్ణయించారు. 1948లో నిర్మల్ పట్టణానికి చెందిన నకాసి కళాకారుడు పాలకొండ గుండాజీ వర్మను విగ్రహం తయారు ఏచయాలని కోరారు. వర్మ నియమ నిష్ఠలతో తలస్నానం చేశాక. ఉపవాస దీక్షలు, చెప్పులు లేకుండా ఈ విగ్రహాన్ని తాయారు చేశాడట. మల విసర్జను వెళ్తె స్నానం చేశాకే ఈ విగ్రహాన్ని తయారు చేసేవాడట. ఆ విగ్రహం పూర్తి కాగానే రూ. 51 కోనుగోలు చేసి భక్తి శ్రద్ధలతో పాలజ్‌లో ప్రతిష్ఠించారు. దీంతో ఆ గ్రామంలో వ్యాధులు తొలిగి పోయి సుఖ శాంతులతో జీవించారు. అప్పటి నుంచి ఆ గ్రామ ప్రజలందరూ 11 రోజుల పాటు వ్యవసాయ పనులు వదిలేసి ఉత్సవాల్లో పాల్గొని భక్తులకు సేవలందిస్తారు. కాలా క్రమేనా కోరిన కోరికలు తీర్చే కర్ర గణేశుడిగా ప్రసిద్ధి గాంచింది.

యేటేటా పెరుగుతున్న రద్దీ

కర్ర గణేషుడికి ముడుపు కడితే... అన్ని పనులు జరుగుతున్నాయని భక్తులు ప్రగాఢ నమ్మకం. ఈ విషయం గ్రామం దాటి రాష్ట్రం దాటి పొరుగు రాష్ట్రాలకు చేరింది. నలుమూలల వ్యాప్తిం చెందింది. అందుకే మహిమలు గల గణేషుడిగా పేరొందిన పాలాజ్‌లో భక్తులు ముడుపులు, కానుకలు చెల్లించుకుంటున్నారు. దీంతో ప్రతీ ఏటా భక్తుల రద్దీ పెరుగుతూనే ఉంది. ఇక్కడికి ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్, మహారాష్ట్రలోని ముంబాయి, పూణే నాగ్‌పూర్, పర్భనీ తదితర ప్రాంతాల నుం చి భక్తులు వస్తుంటారు. వెండి, బంగారం, నగదు బియ్యం రూపంలో కానుకలను సమర్పిస్తారు. ఉత్సవాల రోజుల్లో దారులన్నీ ఈ పాలజ్ వైపే కనిపిస్తాయి.

● రూ. లక్షల్లో ఆదాయం,,.

గతేడాది 11 రోజుల ఉత్సవాల్లో ఆలయానికి రూ. కోటిన్నరకు పైగా ఆదాయం వచ్చింది. రూ. కోటి వరకు కానుకలు వచ్చాయి. పదేళ్ల క్రితం సాదాసీదాగా ఉండే పాలజ్ ఆలయం నేడు అన్ని హంగులతో ఆధుకీకతను సంతరించుకుంది. 2004లో రూ. 1.50లక్షల డబ్బులు ఏర్పాటు చేసిన కమిటీ... గ్రామంలో మరో రూ. 2లక్షల చందాలుగా పోగు చేసి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. డబ్బులు సరిపోక సరిహద్దులోని కుభీర్‌లోనూ చందాలు సేకరించారు. దీంతో ఆలయం పూర్తయింది. లక్షల్లో వచ్చే భక్తులు సమర్పించే కానుకలతో ఇప్పుడు రూపు రేఖలు మారిపోయాయి. స్థలం భక్తుల సౌకర్యార్థం స్నానపు గదులు, మరుగు దొడ్లు నిర్మించారు. చుట్టు పక్కల గ్రామాలకు శుద్ధినీరు అందించేందుకు వాటర్ ప్లాంట్ నిర్మించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీసీ రోడ్లు, వాగుపై వంతెనకు నిర్మించారు.


పాలాజ్ గణేష్ ఆలయం

● ప్రత్యేక బస్సులు..

భైంసా నుంచి 23 కిలోమీటర్ల దూరంలో పాలాజ్ గ్రామం ఉంది. మహారాష్ట్రలోని భోకర్ నుంచి 27 కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం వస్తుంది. 11 రోజుల ఉత్సవాల్లో మహారాష్ట్రలోని బోకర్ నుండి, భైంసా డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు భైంసా మీదుగా పాలజ్‌కు చేరుకోవచ్చు. వాహనాల కోసం ఆలయ ప్రాంగణంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. రోజు వారిగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పాలాజ్‌లోని గణేష్ ఉత్సవాల్లో గ్రామస్థులంతా సేవాభావంతో భక్తులకు సౌకార్యలు కల్పిస్తుంటారు. రోజుకో వార్డుకు చెందిన వారు ఇందులో పాల్గొంటుంటారు. పాలజ్‌లో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.

● నిమజ్జనం ఇలా..

పదకొండు రోజుల పాటు పూజలందుకున్న ఈ కర్ర వినాయకుడిని చివరి రోజు మందిరానికి పక్కనే ఉన్న వాగులోకి ఊరేగింపుగా తీసుకెళ్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పల్లకీని తయారు చేశారు. ఆల పల్లకీలో సుమారు రెండు రోజులు పగలు, రాత్రులు శోభ యాత్ర నిర్వహిస్తారు. అనంతరం వాగులోకి తీసుకెళ్లి వాగు నీటిని చల్లి తిరిగి మందిరానికి వెనుక భాగంలో ఉన్న ఒక గదిలోని బిరువాలో భద్రపరుస్తారు.

● అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..

రఘువీర్ బందేల్‌వార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు

పదకొండు రోజుల పాటు ఉత్సవాల్లో పాలాజ్‌కు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రతీ రోజు అన్నదాన ప్రసాదం అందిస్తాం. రాత్రి వేళలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

● 11 రోజుల పాటు సేవలందిస్తాం..

బాలాజీ పుప్పల్‌వార్, ఉపాధ్యక్షుడు,

వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు 11 రోజుల పాటు భక్తి మార్గంలో నడుచుకుంటాం. ఉత్సవాలు పాటు ఉపవాస దీక్షలు చేపడుతాం. దర్శనానికి వచ్చే భక్తులకు సేవలు చేస్తాం.

తాంసి గ్రామస్థుల ఐక్యత అభినందనీయం

● ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

తాంసి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తాంసి గ్రామంలో శనివారం అధికారికంగా నిర్వహించిన పొలా ల పండుగ విజయవంతంలో గ్రామస్థుల కృషి అభినందనీయమని జిల్లా ఎస్‌జీ, అఖిల్ మహాజన్ అన్నారు. పొలాల పండుగ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ తాను మొట్టమొదటిసారిగా ఇలాంటి పండుగను చూడడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రైతుల్లో ఇంతటి ఉత్సవం, గ్రామస్థుల్లో ఇంతటి చైతన్యం ఉండడం అభినందించదగ్గ విషయం అన్నారు. పార్టీలు, కుల మతాలకు అతీతంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతంలో ప్రతీ ఒక్కరి పాత్ర ఉండటం నిజంగా రాష్ట్రానికే ఓ రోల్ మోడల్ అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్


ఇన్‌పేషంట్ విభాగంలో వైద్య సేవలు పొందుతున్న రోగులు

ఆస్పత్రులు కిటకిట..

» వాతావరణంలో మార్పులతో ప్రబలుతున్న విష జ్వరాలు

భైంసా, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వచ్చిన మార్పులతో జ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. వారం రోజులుగా కురిసిన వర్షాలతో వ్యాధుల బెడద మరింతగా పెరిగింది. ఈ క్రమంలో ఆసుపత్రులలో రోగుల సంఖ్య అధికమవుతోంది. ఆర్థికపరిస్థితి మెరుగ్గానున్న బాధితులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తుండగా ఇతరులు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. పది రోజుల క్రితం వరకు భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో రోజు 500 నుంచి 550 వరకు కొనసాగిన ఓపీ ప్రస్తుతం 700 దాటుతోందంటే పరిస్థితి ఏ విధంగా ఉందో చెప్పకుండానే తెలిసిపోతోంది. ప్రధానంగా జ్వరం, జలుబు తదితర లక్షణాలతో బాధపడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. తల, ఒళ్లు నొప్పులు, జలుబు, జ్వరం తదితర అనారోగ్య లక్షణాలతోనే అధిక సంఖ్యలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. భైంసా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని ఇన్ పెషెంట్ వార్డులలోని బెడ్లన్నీ రోగులతో నిండిపోవడంతో కొరత ఏర్పడుతోంది. ఓపీ నమోదు కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. సగటున రోజుకు 150 మంది రక్తమూత్ర పరీక్షలు చేయించుకుంటుండగా ఒక్కొక్కరికి సుమారు 5 రకాల చొప్పున మొత్తం 750 రకాల పరీక్షలు చేస్తున్నారు.

● ప్రత్యేక జాగ్రత్తలతోనే నివారణ

డా. కాశీనాథ్, సూపరింటెండెంట్

ప్రత్యేక జాగ్రత్తలతోనే సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందాలి. తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చలిగాలికి, వర్షానికి దూరంగా ఉండాలి. పిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. విష జ్వరాల చికిత్స కోసం అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఏ మాత్రం నలతగా అనిపించినా వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందాలి.

సాయి వైకుంఠ ట్రస్ట్ సేవలు మరువలేనిది

తాంసి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తాంసి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన పొలాల పండుగ కార్యక్రమానికి సాయి వైకుంఠ ట్రస్ట్ అధినేత డాక్టర్ రవికిరణ్ యాదవ్ అందించిన సహకారం మరువలేనిదని పలువురు వక్తలు అభినందించారు. కార్యక్రమానికి కావాల్సిన సకల సదుపాయలతో పాటు ఇతర ఏర్పాట్లకు సహకరించిన ఆయనను ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ, కలెక్టర్, ఎమ్మెల్యేలతో పాటు పలువురు అభినందించారు. గ్రామానికి చెంది న వ్యక్తి అయినప్పటికీ అన్ని పనులు వదులుకొని మూడు రోజులుగా తాంసి ఉండటం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికిరణ్ యాదవ్ మాట్లాడుతూ తాను పుట్టిన ఊరులో సేవ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఏ సహాయం కావాలన్నా గ్రామస్థులు తనను సంప్రదిస్తే స్పం దిస్తానన్నారు. ఇలాగే గ్రామసులంతా ఐక్యతతో కలిసిమెలిసి ఉండాలని కోరారు.

ఆలోచింపజేసిన వైజ్ఞానిక ప్రదర్శన

బజార్హత్నూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బజార్ హత్నూర్ మండల కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఆధ్వర్యంలో శనివారం సంకులస్థాయి విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన ఆలోచింపజేసిన అందరిని ఆలోచింపజేసింది. ఈ ప్రదర్శనలో బజార్ హత్నూర్, నేరడిగొండ, ఇచ్చోడ, గుడిహత్నూర్, నార్నూర్ పాఠశాలల విద్యార్థులు పాల్గొని వివిధ నమూనాలను ప్రదర్శించారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రెసిడెంట్ నాగనాథ్, సెక్రటరీ రాజన్న, ఆదిలాబాద్ విభాగ ప్రముఖ్ వేణుమాదవ్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు హాజరై విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు ఒర్సి రమణ, ఒర్సి స్వప్న, దుబ్బుల రమణ, మునేశ్వర్ సంపత్‌లు పాల్గొన్నారు.


బజార్‌హత్నూర్ శిశు మందిర్‌లో విద్యార్థుల ప్రదర్శన

తాంసిలో అధికారికంగా పొలాల పండుగ

» హాజరైన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు
» రాష్ట్ర పండుగగా గుర్తింపునకు నివేదిక
» ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా

తాంసి రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రైతన్నల ఇష్ట దైవమైన పొలాల పండుగను శనివారం తాంసి మండల కేంద్రంలో అధికారికంగా నిర్వహించారు. వేలాదిమంది రైతులు తరలిరాగా బారులు తీరిన బసవన్నల మధ్య పొలాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజార్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో పాటు నిర్వాహకులు ప్రొఫెసర్ తిరుమల రావు, సాయి వైకుంఠ ట్రస్టు అధినేత డాక్టర్ రవికిరణ్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే ఉన్నతాధికారులకు గ్రామస్థులు భాజ భజంత్రీలు, గుస్సాడి, దాండియాతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని పలు వీధుల గుండా నమో పార్వతీపతిహారార మహాదేవ్ అంటూ నినాదాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. సభా ప్రాంగణం కంటే ముందుగా జిల్లా కలెక్టర్, ఎస్పీలు జ్యోతి ప్రజ్వలన చేశారు. రంగు రంగులతో అలంకరించిన బసవన్నలతో ఈ ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక హనుమాన్ ఆలయం వద్ద బారులు తీరిన బసవన్నలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పటేల్ తోరణం తెంపడంతో పండుగ ముగిసింది.

● పర్యాటక కేంద్రంగా తాంసిని తీర్చిదిద్దుతా

జిల్లా కలెక్టర్ రాజార్షిషా

తాంసి గ్రామస్థుల ఐక్యతకు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని జిల్లా కలెక్టర్ రాజార్సిషా అన్నారు. శనివారం నిర్వహించిన పొలాలలో పండుగ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ తాంసి గ్రామంలో సమృద్ధిగా పర్యాటక కేంద్రానికి సంబంధించిన వనరులు ఉన్నాయని, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. జలజల పారే వాగుతో పాటు ఒకే దగ్గర గ్రామ దేవత ఆలయం, హనుమాన్ ఆలయాలు ఉండడం ఎంతో పవిత్రకు నాందిగా అభివర్ణించారు. గ్రామస్థులంతా ఐకమత్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి పండుగలను గ్రామ గ్రామాన ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఇలాగే ఏ కార్యక్రమాలు చేపట్టిన గ్రామస్థులంతా సహకరించాలని కోరారు.


ప్రొఫెసర్ తిరుమలరావును సన్మానిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు

● కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలకు బసవన్నలతో స్వాగతం

తాంసి గ్రామంలో నిర్వహించిన పొలాల పండుగ కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్పీ, కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులకు గ్రామస్థులు బసవనలతో స్వాగతం పలికారు. గ్రామంలోకి రాగానే బసవన్నలను తీసుకువెళ్లి ముందుగా పూజలు చేయించారు. అనంతరం మహిళల మంగళహారతులు, భాజా భజంత్రీలు, డప్పు చప్పుల మధ్య ఊరేగింపు నిర్వహించారు.

● ఎద్దులకు పూజలు చేసిన ఎస్పీ, కలెక్టర్లు

పొలాల పండుగని పురస్కరించుకొని ఎద్దులకు జిల్లా కలెక్టర్ రాజార్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహజనులు ఎద్దులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమ, పసుపు వేసి వారి పాదాలకు నమస్కరించారు. సంప్రదాయ బద్ధంగా నిర్వహించే పండుగలను ప్రతి ఏటా ఇలాగే నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ నర్సయ్యలతో పాటు పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పోటీల్లో గెలుపొందిన రైతులకు ఈ సందర్భంగా బహుమతులను ప్రధానం చేశారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.


ఎద్దులకు పూజలు చేస్తున్న ఎస్పీ, కలెక్టర్


ఊరేగింపులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, పలువురు అధికారులు

సంప్రదాయంగా పొలాల అమావాస్య

ఇంద్రవెల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో పొలాల అమావాస్యతో పండుగ వాతావరణం నెలకొందని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా అన్నారు. శనివారం మండలంలోని కేస్లాగూడ గ్రామంలో నిర్వహించిన పొలాల పండుగ వేడుకల్లో ఐటీడీఏ పీవో పాల్గొన్నారు. ముందుగా ఆదివాసీ మహిళలు సంప్రదాయ పద్ధతిలో ప్రాజెక్టు అధికారికి శాలువా కప్పి సింధూర తిలకం పెట్టి ఆహ్వానించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాల మధ్య స్వాగతం పలికారు. గ్రామ పటేల్‌తో ఐటీడీఏ పీవో కలిసి పూజ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎద్దులకు నై వేద్యాలు తినిపించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ పొలాల పండుగ ప్రతీ సంవత్సరం శ్రావణ మాసంలో వస్తుందని, పండుగను బేధాలు లేకుండా అందరు కలిసికట్టుగా జరుపుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం గ్రామ పటేల్ గ్రామంలో నెలకొన్న నీటి సమస్య గురించి విన్నవించగా ప్రాజెక్టు అధికారి స్పందించి త్వరలోనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలోని త్రాగునీరు, మరుగుదొడ్లు నిర్మించాలని డీఈ శివప్రసాద్‌ను ఆదేశించారు.


గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

● వసతి గృహ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా అన్నారు. శనివారం మండలంలోని ముత్నూర్ గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, విద్య, వైద్యం, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కలించి నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు ప్రతీ రోజు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారం, శుద్ధమైన తాగునీటిని అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వర్షాల నేపథ్యంలో దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రతిరోజు వంట గది, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించి సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎడ్లకు నైవేద్యం తినిపిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఘనంగా జాగాయి మాతరి వేడుకలు

ఉట్నూర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) ఉట్నూరు ఏజెన్సీలోని ఆదివాసి గిరిజనులు తమ తమ గ్రామాల్లో శనివారం జాగాయి మాతరి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. పొలాల అమావాస్య పండుగ మరుసటి రోజు శనివారం జాగాయి మాతరి (గ్రామ దేవత)కు ప్రతీయేటా పూజలు చేయడం ఆదివాసుల సంస్కృతిలో ఒక భాగం. గ్రామంలోని గిరిజనులకు ఇలాంటి విపత్కర పరిస్థితులు రావద్దని, అంటు వ్యాధుల నుంచి జాగాయి మాతరి కాపాడాలని కోరుతూ ఆయా గ్రామాలకు చెందిన గిరిజనులు పురుషులు మాత్రమే గ్రామం బయటకు వెళ్లి గ్రామ దేవతకు సహపంక్తి పూజలు నిర్వహించారు. గ్రామం నుంచి ఊరి బయటకు వెళ్లేటప్పుడు మా ఊరి నుంచి కీడు వెళ్లిపోవాలంటూ జాగాయి మాతరిని స్మరిస్తూ కేకలు వేస్తూ గ్రామ పొలిమేరకు వెళ్లి గిరిజనులు పూజలు నిర్వహించారు ఉట్నూరు మండలంలోని సుద్దగూడ, మత్తడి కూడా, తాటిగూడ, తేజపూర్, కల్లూరు గూడ, గన్‌పూర్, శంభు కూడా, చింతగూడ, సోనాపూర్, నర్సాపూర్ బి తదితర గ్రామాలలో ఆది వాసి గిరిజనులు జాగాయి మాతరి వేడుకలు నిర్వహించారు.


ఉట్నూర్ మండలంలో గ్రామ పొలి మేరకు వెళ్తున్న ఆదివాసీ గిరిజనులు

26న గురుకుల పాఠశాలల్లో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్

ఉట్నూర్ ఆగష్టు 23 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 5,6,7,8,9వ తరగతులలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ ఈ నెల 26న నిర్వహిస్తున్నామని గురుకులాల రీజినల్ కో-ఆర్డినేటర్ అగస్టీయన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉట్నూరులోని బాలికల గిరిజన గురుకులం జూనియర్ కళాశాలలో ఈనెల 26న గిరిజన బాల బాలికలకు ఉట్నూరు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఉదయం 10.30 నుంచి స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు.

చెన్నై టూ ఇందూర్

- భవానీపేట్‌లో వాలిన అనుమానాస్పద పావురం
- పక్షి కాళ్లకు కోడ్ అక్షరాలతో రింగులు
- రేసింగ్ బర్డ్‌గా గుర్తించిన పోలీసులు
- చెన్నై క్లబ్‌కు చెందినదిగా అనుమానం

బైకు రేస్, కార్ల రేస్ తెలుసు. గుర్రాల రేస్ తెలుసు. పావురాల రేస్ గురించి తెలుసా? ఇది, వందల ఏళ్లనాటి క్రీడ. నిజాం కాలంలో ఇది ఉండేది. ఇది ఇప్పుడు కూడా చెన్నైలో కొనసాగుతోంది. అక్కడి నుంచి బయల్దేరిన ఓ పావురం.. అలసి ఇటీవల నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని భవానీపేట్ గ్రామానికి చేరింది. అనుమానస్పద స్థితిలో సంచరిస్తున్న పావురాన్ని గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు పావురాన్ని స్వాధీనం చేసుకున్నారు. దానిని చూసిన స్థానికులు అది రేసింగ్ పావురంగా గుర్తించి, జిల్లాలో ఎన్నో ఏళ్ల క్రితం కనుమరుగైన పావురాల పోటీలను గుర్తుచేసుకున్నారు.



9261 3695

పందేనికి సంబంధించిన కోడ్

సండే స్పెషల్
SUNDAY SPECIAL

ఆదిలాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కొన్ని వందల ఏళ్ల కిందట పావురాల పోటీ ఉండేది. బోధన్ మండలంలో గత మంగళవారం చోటు చేసుకున్న సంఘటనతో నిజాం కాలంలోని పోటీలు మళ్లీ తెరపైకి వచ్చాయి. బోధన్ మండలంలోని భవానీపేట్ గ్రామంలో ఓ పావురం అస్వస్థతకు గురై ఓ బాలుడికి దొరికింది. స్థానికులు పావురం కాళ్లకు ఉన్న రింగ్‌లు చూసి ఆశ్చర్యపోయారు. పోలీసులకు చూపించగా అది రేసింగ్‌కు సంబంధించిన పావురంగా గుర్తించారు.

పందెం ఇలా...

పందెంలో పాల్గొనే ప్రతి పావురానికి రింగ్ నంబర్లు, కేటగిరీలు ఉంటాయి. రేసింగ్‌లో పాల్గొనే పావురాలను ముందుగా రేసింగ్ ప్రారంభించే ప్రదేశానికి తీసుకెళ్తారు. ఆయా పావురాలకు ఉదయమే మంచినీరు తాగించి వదిలేస్తారు. రేసింగ్‌లో పాల్గొన్న పావురాల యజమానుల ఇళ్లలో రిఫరీలు ఉంటారు. పావురం ఏ సమయానికి వచ్చిందో చూసి దూరాన్ని బట్టి వేగాన్ని గుర్తిస్తారు. ముందుగా చేరుకున్న పావురాన్ని విజేతగా నిర్ణయిస్తారు. ఎంత దూరంలో వదిలేసినా... ఇవి ఇంటికి తిరిగి వచ్చేస్తాయి. వాటికి కావాల్సిందల్లా వాటికి దారి చూపే టెక్నిక్ మాత్రమే.. కొన్నిసార్లు యేడాది తర్వాత కూడా ఇంటికి తిరిగీ రావచ్చు. కాగా ప్రస్తుతం నిర్వహించే రేసింగ్‌లో కుతుబ్‌షాహీల కాలంలో ఉన్న నిబంధనలే ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.

రేసర్లు పావురాల రేసింగ్‌లో పాల్గొనేవారు కచ్చితంగా పావురాల ప్రేమికులు అయి ఉండాలనే నిబంధన ఉంది. వెయ్యి నుంచి 1500 కిలోమీటర్ల వరకు రేసింగ్ నిర్వహిస్తుంటారు. మూడు నెలల వయసు నుంచే ట్రైనింగ్‌ను ప్రారంభిస్తారు. అలా యేడాదిపాటు ఇంటి చుట్టూ తిప్పుతారు.

పావురాలు రేసింగ్‌కు పనికి వస్తాయా? లేదా అన్న విషయాన్ని ఆయా పావురాల కళ్లను చూసి చెబుతారు. రేసింగ్‌లో పాల్గొనే పావురాలకు పది రకాల ధాన్యాలు, జొన్నలు, మొక్క జొన్నలతోపాటుగా మల్టీ విటమిన్ టాబ్లెట్లు కూడా ఇస్తారు. ఆయా పావురాలకు సంబంధించి రెండు రింగ్‌లను కాళ్లకు తగిలిస్తారు. ఒకటి క్లబ్‌కు సంబంధించినవి, ఇంకోటి పావురం వయస్సుకు సంబంధించినది. కాగా వాటిలో ఓనర్లకు సంబంధించిన వివరాలు ఉంటాయి.



పందెం పక్షి



కాళ్లకు ఉన్న రింగులు

రేసింగ్‌లో రారాజులు..

పావురాల రేసింగ్‌లకు సంబంధించి ప్రత్యేకంగా క్లబ్‌లు కూడా ఉన్నాయి. పావురాల ఓనర్స్‌ని ఫాన్సీయస్ అంటారు. కొందరు ఈ పావురాల రేస్‌లను హాబీగా ఎంచుకుంటారు. ఆయా పావురాల్లో అనేక జాతులు ఉన్నప్పటికీ తుగిడి, హోమర్, టంబ్లర్‌లు రేసింగ్‌కు అనుకూలంగా ఉంటాయి. హోమర్ డిస్టెన్స్ రేస్‌లో పాల్గొంటే, టంబ్లర్ తన ఓర్పును తట్టిచూడమంటుంది. ఇక తుగిడి గుంపుల పోటీలో ఇది చాలా యాక్టివ్‌గా ఉంటుంది. నిజాం కాలం తర్వాత కనుమరుగైన ఈ పావురాల రేసింగ్ హైదరాబాద్‌తో పాటు, బెంగుళూరు, చైన్నై, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో ప్రస్తుతం చాలా పాపులర్. హైదరాబాద్ క్లబ్ వారు నిర్వహించే రేసింగ్‌లకు ఆదిలాబాద్, నిర్మల్, బోపాల్ వంటి ప్రదేశాలు ఎంచుకుంటారు. ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చిన పావురాలను రేసింగ్ ప్రదేశానికి పంపుతారు.

సిమెంట్ పరిశ్రమకు అడ్డంకులు

- రేణుక సిమెంట్ పరిశ్రమ భూములపై మళ్లీ లొల్లి
- భూసేకరణ కోసం వెళ్లిన అధికారులను అడ్డుకున్న రైతులు
- ఎకరాన రూ.50లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్
- న్యాయం కోసం కోర్టుకు
- పరిశ్రమ ఏర్పాటు ప్రశ్నార్థకం

జిల్లాలో రేణుక సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై ఆశలు గల్లంతవుతున్నాయి. ఏళ్ల తరబడి ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నా అడుగడుగునా ఆటంకాలే ఎదురవుతున్నాయి. చివరకు పరిశ్రమ ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది.

ఆదిలాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): 28 ఏళ్ల క్రితం మూతబడిన సీసీఐ సిమెంట్ పరిశ్రమను పునఃరుద్ధరించడం సాధ్యం కాదని తేలిపోవడంతో ప్రత్యామ్నయంగా బీఆర్ఎస్ హయాంలో మరో పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. యాపల్‌గూడ సమీపంలో రేణుకసిమెంట్ పరిశ్రమను ఏర్పా టు చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముమ్మర ప్రయత్నాలు జరిగాయి. అయిన ఇప్పటి వరకు అడుగు ముందుకు పడినట్లు కనిపించడం లేదు. గత ఏడేళ్ల క్రితం సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూములను సంబంధిత కంపెనీ యజమాన్యం కొనుగోలు చేసింది. ఆదిలాబాద్‌రూరల్ మండలం యాపల్‌గూడ గ్రామ పరిసర ప్రాంతాల్లో 107.31 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించి పరిశ్రమ నిర్మాణానికి సిద్ధమయ్యారు. అలాగే ముడిఖనిజ సేకరణకు మరో 664.21 ఎకరాలను గుర్తించి నోటిఫికేషన్ జారీ చేశారు. కాని పరిశ్రమను ఏర్పాటు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతూ వస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకోసం మళ్లీ ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆరుమాసాల క్రితం జిల్లా అధికారులు రైతులతో బహిరంగ సమావేశాన్ని నిర్వహించి పొల్యూషన్‌పై ప్రజాభిప్రాయ సేకరణను కూడా పూర్తి చేశారు. గతంలోనే ముడిఖనిజం కోసం భూములను సేకరించేందుకు అధికారులు నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేశారు. అయితే అదనంగా పరిహారం చెల్లించాలంటూ రైతులు ఆందోళనలు, నిరసనలు చేపడుతూ వస్తున్నారు. శనివారం రెవెన్యూశాఖ అధికారులు రేణుక సిమెంట్ పరిశ్రమ భూములను సర్వే చేసి హద్దులు నిర్ణయించేందుకు క్షేత్రస్థాయిలోకి వెళ్లగా రైతులు అడ్డుకోవడంతో మళ్లీ గందరగోళ పరిస్థితులకు దారి తీసింది. అడుగడుగునా అభ్యంతరాలు వ్యక్తం కావడంతో పరిశ్రమ ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది.



రెవెన్యూ అధికారులను అడ్డుకున్న రైతులు

● పరిహారం ఇస్తేనే..

అడిగినంత పరిహారం ఇస్తేనే రేణుక సిమెంట్ పరిశ్రమలకు భూములు ఇస్తామని రైతులు స్పష్టం చేస్తున్నారు. ఎకరాన రూ.50లక్షల పరిహారాన్ని ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారు. అలాగే భూమిని కోల్పోయిన రైతు కుటుంబాలకు ఇంటికో ఉద్యోగాన్ని కల్పించాలని కోరుతున్నారు. లేదంటే భూమికి బదులు మరోచోట భూములను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల డిమాండ్లను పరిష్కరిస్తేనే సిమెంట్ పరిశ్రమకు అవసరమైన భూములను ఇచ్చేందుకు సిద్ధమని రైతులు చెబుతున్నారు. దీంతో పరిశ్రమ ఏర్పాటుపై మళ్లీ అనుమానాలు, అయోమయ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గతంలో ఎకరాన రూ.9.25 లక్షల పరిహారాన్ని చెల్లించారు. ప్రస్తుతం దాని కంటే అధికమొత్తంలో ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే కంపెనీ యజమాన్యం నిర్ణయించిన పరిహారానికి రైతులు చెబుతున్న పరిహారానికి ఎలాంటి పొంతన లేకుండా పోయింది. ముడిఖనిజాన్ని సేకరించేందుకు రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు రాక పోవడంతో పరిశ్రమ ఏర్పాటు పై పలు సందేహాలు వ్యక్తమయ్యాయి.

● 515.24 ఎకరాలకు నోటీసులు

సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు సిద్ధం కావడంతో భూముల ధరలు భారీగా పెరిగాయి. దీంతో పెరిగిన ధరలను చెల్లించాలంటూ రైతులు పట్టుబడుతున్నారు. అయితే గతంలో చెల్లించినా ధరలనే మళ్లీ చెల్లిస్తామంటూ కంపెనీ యజమాన్యం చెబుతున్నా రైతులు ఒప్పుకోవడం లేదు. రేణుక సిమెంట్ పరిశ్రమకు అవసరమైన ముడి ఖనిజాన్ని సేకరించేందుకు అధికారులు మొత్తం 664.21 ఎకరాలను గుర్తించారు. ఇందులో 515.24 ఎకరాల భూసేకరణకు పరిహారాన్ని చెల్లించేందుకు సంబంధిత రైతులకు నోటీసులు జారీచేశారు. సర్వే నెంబర్ 20, 27, 30, 82, 83లలో నుంచి భూమిని సేకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో అసైన్డ్, పట్టా భూములు ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఈ భూముల మార్కెట్ విలువ ఎకరాన 5 లక్షల వరకు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కాని బయట మార్కెట్ విలువ ప్రకారం ఎకరాన రైతులకు 10 లక్షలను చెల్లించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. అనుకున్నట్లుగానే భూసేకరణ ప్రక్రియ పూర్తయితే పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని రకాల అనుమతులను ఇచ్చే అవకాశం కనిపిస్తుంది.

రూ.50లక్షలు చెల్లించాలి

● ద్యావర్తిస్వామి రైతు, యాపల్‌గూడ గ్రామం



ఎకరాన రూ.50లక్షల పరిహారం ఇస్తేనే సిమెంట్ పరిశ్రమకు భూములు ఇస్తాం. గతంలోనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. రూ.10లక్షల నష్ట పరిహారం ఇస్తే ఏ మూలాన సరిపోదు.పరిహారం పై కోర్టులో కేసు ఉండగా అధికారులు ఎలా హద్దులు నిర్ణయిస్తారు. పరిహారం ఇచ్చేంత వరకు భూములను ఇచ్చేదే లేదు.

కోర్టును ఆశ్రయించిన రైతులు

భూసేకరణకు అధికారులు నోటీసులు ఇవ్వడంతో ఆయా గ్రామాల రైతులు కోర్టును ఆశ్రయించారు. ముఖ్యంగా ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని రామాయి, యాపల్‌గూడ, రాములుగూడ, యశ్వంత్‌గూడ, మత్తడిగూడ, కొత్తగూడ, రాంపూర్, అనుకుంట మొత్తం 8 గ్రామాలకు చెందిన రైతులు పరిహారం కోసం పట్టుబడుతున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల రైతులు రేణుక సిమెంట్ పరిశ్రమ బాధిత రైతు పోరాట సమితి పేరిట ఆందోళనకు దిగుతున్నారు. గతంలో సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు ప్రత్యేక కార్యవర్గాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో బీజేపీ పార్టీ తరఫున పలుమార్లు ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. అయితే పరిహారం చెల్లింపుల పై అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని రైతులను ఒప్పిస్తే పరిశ్రమ ఏర్పాటుకు అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తాత్కాలికంగా నిలిపి వేశాం..

● సాయిరాం (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సాత్నాల మండలం)

రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. దీంతో సర్వేను తాత్కాలికంగా నిలిపివేశాం. ప్రస్తుతం 118 ఎకరాలలో సర్వే చేసి హద్దులు నిర్ణయించాల్సి ఉంది. కాని రైతులు ఒప్పుకోవడం లేదు. దీని పై నోటిఫికేషన్ కూడా విడుదలైంది. ఉన్నతాధికారులతో మాట్లాడుతామని రైతులు చెబుతున్నారు. తదుపరి ఆదేశాల ప్రకారమే హద్దులను నిర్ణయిస్తాం.

యురియా అందజేయాలని దున్నపోతుకు వినతి



ముక్రా (కే) గ్రామంలో దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఇచ్చోడ, ఆగస్టు, 23 (ఆంధ్రజ్యోతి) : యరియా కోసం రైతులు సోసైటీల వద్ద పడిగాపులు కాస్తున్నారని ధర్నాలు, రస్తారోకోలు చేసినా రైతులను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండలంలోని ముక్రా(కె) రైతులు వారి ఆవేదనను వ్యక్తం చేశారు. శనివారం గ్రామ రైతులు దున్నపోతుకు వినతిపత్రాన్ని అందించి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి విషయంలో ప్రభుత్వం రైతులను మోసం చేస్తూ వస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో యురియా సమస్య రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వానికి చెప్పిన దున్నపోతుకు చెప్పినా ఒకటేనని నిరసన తెలుసుతూ గ్రామస్థులకు సరిపడా యురియా అందజేయాలని వినతిపత్రాన్ని అందజేశారు గ్రామస్థులు. కార్యక్రమంలో రైతులు మీనాక్షి, సుభాష్ పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి సర్కార్ అండ

● ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, ఆగష్టు 23 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం ఆర్థికంగా అండ కల్పిస్తుందని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోనీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉట్నూర్ జన్నారం పెంబి మండలాలకు చెందిన బాధితులకి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చులకోసం సీఎం సహాయ నిధి ద్వారా వందలాదిమందికి మంజూరు పత్రాలు ఇప్పించామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిర్విరామంగా చేపడుతామన్నారు. ఈ సందర్భంగా ఉమ్రి గ్రామానికి చెందిన కర్తార్ సింగ్ కు రూ. 60వేలు , పెంబి మండలం నాగ్‌పూర్ కు చెందిన రాజమణికి రూ.54,500, జన్నారం మండలానికి చెందిన వసి కి రూ, 56 వేలు,వనిత, శ్రీనివాస్ లకు రూ. 20వేలవంతున, లక్ష్మికి రూ.14 వేలు, స్వప్నకు రూ.34,500 , మరొక జల దేవికి రూ.22 వేలు, గంగాధర్ కు రూ, 16 వేల చెక్కులను పంపిణీ చేశారు.



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

తాంసీలో అధికారికంగా పొలాల పండుగ - 7లో

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఇండ్ల మంజూరు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ టౌన్ /జైనథ్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పేదోడి సొంత ఇంటి కలను నెరవేర్చేలా ప్రభుత్వాలు పనిచేస్తు న్నాయని ఎమ్మెల్యే పాయల్‌శంకర్ అన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో ఆదిలాబాద్ అర్బన్, రూరల్, మావల మండలాల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. దీనికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు పత్రాలను అందించి ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, ఎంపీ డీవోలు స్వప్నశీల, భూమయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇండ్లు ఇస్తాం

జైనథ్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రధానమంత్రి అవాస్‌యోజన పథకం కింద అర్హులందరికీ ఇండ్లు ఇస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. శనివారం బేల మండల కేంద్రంలోని గణేష్‌గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. భారీవర్షాలు పెన్‌గంగా వరదల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. జైనథ్, బేల, సాత్నాల, బోరజ్ మండలాల తహసీల్దార్‌లు రఘునందన్‌రావ్, ఆత్రంనారాయణ, రాథోడ్‌రాజేశ్వరి, జాదవ్‌రామారావు, ఎంపీడీఓలు మహేశ్‌కుమార్, మహేందర్, వెంకట్‌రాజ్, సీహెచ్ వేణురెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పి.నర్సయ్య, బీజేపీ నాయకుల్దుఅశోక్‌రెడ్డి, బోయర్‌విజయ్, టి.రమేష్‌లతో పాటు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు నష్టపరిహారం చెల్లించాలి'

నేరడిగొండ , ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో నష్టపోయిన పంట పొలాలకు ఎకరానికి 25 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న అన్నారు. శనివారం మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన పంట నష్టపోయిన రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ వారం రోజుల క్రితం కురిసిన అతి భారీవర్షాలకు నది పరివాహక ప్రాంతంలో ఉన్నటువంటి వ్యవసాయ భూమి కోతకు గురైందన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్, తలమడుగు, తాంసి, జైనథ్, బేలా ఇంద్రవెల్లి, తదితర మండలాల్లో దాదాపుగా 30 వేల ఎకరాలకు పైగా పంట నష్టపోయిందని బొర్రన్న ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు భామనే రమేష్, ఉపేందర్, బి.రాములు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పంట పొలాలను పరిశీలిస్తున్న రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● మాజీ ఎంపీ సోయం బాపూరావు

నేరడిగొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎంపీ. రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు అన్నారు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో నిర్వహించగా సోయం బాపురావు ముఖ్య తిథిగా హాజరై ఆడే గజేందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఎరువుల కొరతను సృష్టించిందని, అయినా తగినంత యూరియా అందిస్తున్నామన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులే చరిత్రలో నిలిచాయన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ జిల్లా అధ్యక్షుడు అడ్డి భోజ రెడ్డి, తలమడుగు మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, నిర్మల్ గ్రంథాలయ చైర్మన్ అంజుమాన్. బోథ్ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బొడ్డు గంగా రెడ్డి, ఆత్మ చైర్మన్ రాజు యాదవ్. జిల్లా అధికార ప్రతినిధి పశుల చంటి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంతరావు ఉన్నారు.



ఆడే గజేందర్‌ను సన్మానిస్తున్న మాజీ ఎంపీ

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రాజీపడదగిన కేసులను కక్షిదారులు పరిష్కరించుకునేలా జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్ రావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని ఆయన చాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ అధికారులతోపాటు న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. కోర్టుల చుట్టూ తిరుగుతూ కక్షిదారులు తమ సమయాన్ని వృథా చేసుకోకుండా రాజీమార్గంలో వాటిని పరిష్కరించుకోవాలన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని నిరసన

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సీపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట తపస్ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు సునీల్ చౌహాన్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ఆగస్టు 23, 2014న జీవో నెంబర్ 28ని అక్రమంగా తీసుకొచ్చి ఉద్యోగుల జీవితాల్ని అతలాకుతలం చేశారని, ఇలాంటి జీఓను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. జీవో నెంబర్ 28 ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వలభోజు గోపి క్రిష్ణ, సంఘ బాధ్యులు దత్తాత్రి ముండే, నాందేవ్, వాసుదేవ్, నిర్వాన శాస్త్రి, కేశవ్, గోపాల్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న తపస్ నాయకులు